## క్లుప్తంగా

### పోలీస్ సురక్షా దినోత్సవ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, ప్రజాప్రతినిధులు

**టేకులపల్లి:** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా దశాబ్ది ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో పోలీసు సురక్షా దినోత్సవ వేడుకలు ఆదివారం సాయంత్రం హేమచంద్రాపురంలోని పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు టేకులపల్లి సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్‌ఐ రమణారెడ్డి ఆధ్వర్యంలో కారుకొండ క్రాస్‌రోడ్ వద్ద నుంచి పోలీసు హెడ్ క్వార్టర్స్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు పాల్గొన్నారు.

### డిగ్రీ కళాశాలలో ‘ఓపెన్’ పరీక్షలు

**కొత్తగూడెంరూరల్:** లక్ష్మీదేవిపల్లి మండలంలోని శ్రీ రామచంద్ర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ 6వ సెమిస్టర్ బీఏ, బీకామ్, బీఎస్సీ యూజీ పరీక్షలు జరిగాయి. మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు జరిగిన ఈ పరీక్షలకు 144 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 136 మంది హాజరయ్యారు. ప్రిన్సిపాల్ హావీల్ పర్యవేక్షించారు. అభ్యాసకుల సహాయ కేంద్రం ఇన్‌చార్జ్ డి.రమేష్ పాల్గొన్నారు. సోమవారం కూడా ఈ పరీక్షలు జరగనున్నాయి.

### దళారులను ఆశ్రయించొద్దు

**టేకులపల్లి:** తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పోడు పట్టాల పంపిణీ ప్రక్రియ చేపట్టిందని టేకులపల్లి ఎంపీడీఓ కోట వీరబాబు ఆదివారం పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాపితంగా లక్షలాది మంది రైతులు పోడు పట్టాల కోసం ఎదురు చూస్తున్న తరుణంలో దరఖాస్తులు స్వీకరించి, వాటిని పరిశీలించి అర్హులను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఈ నెల 24 నుంచి పోడు పట్టాల పంపిణీకి సన్నాహాలు జరుగుతున్నాయని తెలిపారు. మండలంలో సుమారు నాలుగు వేల మందికి పోడు పట్టాలు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని 36 గ్రామ పంచాయతీల్లో అర్హులైన వారికి పోడు పట్టాలు ఇవ్వబడతాయని ఎవరూ అపోహలు పెట్టుకోవద్దన్నారు. పోడు రైతులు దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని చెప్పారు. పోడు పట్టాల విషయంలో ఎవరైనా డబ్బులు అడిగినా, ఇబ్బంది పెట్టినా తన దృష్టికి తీసుకువాలని కోరారు.

### నిరుద్యోగ భృతి, ఉద్యోగాల సాధనకు పోరాడాలి





లక్ష్మణ్, అధ్యక్షుడు, సతీష్, ప్రధాన కార్యదర్శి

**టేకులపల్లి:** ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి సాధనతో విష సంస్కృతికి నిర్మూలన కోసం యువతీ, యువకులు పోరాడాలని పీవైఎల్ కొత్తగూడెం డివిజన్ కార్యదర్శి నోముల భాను చందర్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఆదివారం జరిగిన పీవైఎల్ మండల సభలో మాట్లాడారు. 5, 6వ తేదీల్లో ఖమ్మంలో జరిగే పీవైఎల్ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. అనంతరం పీవైఎల్ మండల అధ్యక్షుడిగా భూక్యా లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శిగా తోటకూరి సతీష్‌కుమార్‌తో పాటు గవాస్కర్, బానోతు క్రాంతికుమార్, రామ, కిషన్, కిరణ్ తదితరులతో కమిటీని ప్రకటించారు.

### ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి

**కొత్తగూడెంఅర్బన్:** ప్రపంచ పర్యావరణ దినోత్సవం జూన్ 5న జరుపుకుంటున్న నేపథ్యంలో ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించే చర్యలు సైతం చేపట్టాల్సిన అవసరముందని గ్రీన్ వారియర్ చంద్రశేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి సంవత్సరం 400 మిలియన్ల టన్నుల ప్లాస్టిక్ ఉత్పత్తి జరుగుతున్న నేపథ్యంలో అందులో పది శాతం మాత్రమే రీసైకిల్ అవుతుందని వివరించారు. భూమి ఎదుర్కొంటున్న సమస్యల పట్ల సామాజికవేత్తలతో అధ్యయనం జరిపించి ప్రపంచ దేశాలు భారీ ప్రణాళిక రూపొందించుకోవాలిన్సిన అవసరముందని, లేకపోతే ముందు తరాలకు భూమి నివాస యోగ్యం కాదన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాల వలన జీవరాశికి హానికరం, జీవ వైవిధ్యానికి పెను విఘాతమని, ప్లాస్టిక్ కాలుష్యాన్ని నివారించకపోతే సముద్ర జీవ రాశులు, మూగజీవాలు, భవిష్యత్ తరాల మనుగడ ప్రశ్నార్థకం అవుతుందని తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో గేదెలు మృతి

**జూలూరుపాడు:** వినోభానగర్ గ్రామ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని రెండు గేదెలు మృతి చెందాయి. ఆదివారం సీతారామ కెనాల్ వద్ద ప్రధాన రహదారిపై రెండు గేదెలు చనిపోయి ఉన్నాయి. ఈ విషయం తెలుసుకున్న వినోభానగర్ గ్రామ పంచాయతీ సిబ్బంది చనిపోయిన గేదెలను అక్కడ నుంచి తొలిగించారు. గేదెలు ఎవరివో వివరాలు తెలియలేదని పంచాయతీ సిబ్బంది తెలిపారు.

# చెదిరిన పంటకాల్వలు..

- నిధులు లేవు.. నిర్వహణా లేదు
- సాగునీరు చేనుకు చేరేదెలా
- పూడిపోయి కొన్ని.. గండ్లుపడి మరికొన్ని..
- మత్స్యశాఖ, పంచాయతీలకు ఆదాయ వనరుగా తటాకాలు



రాఘబోయినగూడెం పెద్దచెరువు

**ఇల్లెందురూరల్:** చెరువులకు పంట చేలకు వారధి లాంటివి పంట కాల్వలు. ఇవి బాగుంటేనే సాగునీరు పంటలు పండుతాయి. ఇంత ప్రాధాన్యం ఉన్న పంటకాల్వలపై పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారు. గతేడాది భారీ వర్షాలతో కొన్నిచోట్ల రూపం కోల్పోయి.. మరికొన్ని చోట్ల గండ్లు పడి.. ఇంకొన్ని చోట్ల పిచ్చిచెట్లు పెరిగి.. చివరకు నీటిసరఫరా జరిగే పరిస్థితి లేకుండా పోయాయి.

**చెరువుల అభివృద్ధికే పరిమితం..**

2014లో రాష్ట్ర ప్రభుత్వం మిషన్ కాకతీయ పథకం చేపట్టి చెరువుల మరమ్మతులకు పెద్దపీట వేసింది. రూ.కోట్లు ఖర్చుపెట్టి చెరువులను సుందరంగా తీర్చిదిద్దింది. 2018లోనూ అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం చెరువులను పట్టించుకోవడం లేదు. ఫలితంగా కాల్వలు అధ్వానంగా మారగా చెరువులు సైతం దెబ్బతింటూ వస్తున్నాయి.

**నాడు అలా.. నేడు ఇలా..**

2015కు ముందు మీడియం, మైనర్ ఇరిగేషన్ చెరువుల నుంచి నీటితీరువా వసూలు చేసేవారు. ఈ నిధులు 90శాతం పంటకాల్వల నిర్వహణకు ఖర్చు చేసేవారు. 2015–16లో సీఎం కేసీఆర్ నీటితీరువా వసూలును రద్దు చేశారు. దీంతో పంటకాల్వల నిర్వహణకు నిధులు లేక నిర్లక్ష్యానికి గురయ్యాయి.



పెద్దచెరువు కాల్వ దుస్థితి ఇలా..



అధ్వానంగా చల్లసముద్రం చెరువు పంటకాల్వ

**చెదిరిన పెద్ద చెరువుల కాల్వలు..**

ఇల్లెందు మండలంలో ఏడు పెద్ద చెరువులు, 102 చిన్న చెరువులు ఉన్నాయి. ప్రస్తుతం ఆయా చెరువులకు సంబంధించిన పంట కాల్వలు సాగునీటి సరఫరాకు అనుకూలంగా లేవు. చల్లసముద్రం పెద్దచెరువు కట్టతోపాటు తూములు శిథిలావస్థకు చేరుకున్నాయి. కాల్వలకు అడుగడుగునా గండ్లు పడ్డాయి. పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. గుర్తించిన ఇరిగేషన్ అధికారులు చెరువు, కాల్వల అభివృద్ధికి రూ.1.20 కోట్ల వ్యయంతో ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపారు. ఇలాగే రాఘబోయినగూడెం పెద్దచెరువు కాల్వలకు గత వానాకాలం సీజన్‌లో పెద్దపెద్ద గండ్లు పడ్డాయి. రైతులు తమ సొంత ఖర్చులతో ఇసుక బస్తాలను నెట్టుగా వేసి నీటి సరఫరా జరిగేలా జాగ్రత్తలు తీసుకున్నారు. మండలంలో ఏ చెరువును చూసినా ఇదే పరిస్థితి.

**ఆదాయ వనరుగా చెరువులు...**

గతంలో చెరువులంటే పంటలకు సాగునీటిని మాత్రమే అందించేవి. కొన్ని పెద్దచెరువులు మాత్రమే చేపల పెంపకానికి అనువుగా ఉండేవి. కానీ 2015 తరువాత చెరువులు సాగునీటిని అందించడంతోపాటు చేపల ఉత్పత్తి కేంద్రాలుగా మారాయి. దీనికితోడు ప్రభుత్వం ప్రతి చెరువులోకి చేపపిల్లలను ఉచితంగా సరఫరా చేస్తూ ప్రోత్సహిస్తోంది. చేప పిల్లల ఉత్పత్తి గణనీయంగా పెరగడంతో మత్స్యశాఖ స్పందించి అత్యధిక చెరువులకు సొసైటీలను ఎంపిక చేసి చేపలు పట్టుకునే బాధ్యత ఆయా సొసైటీలకు అప్పగించి ఎంతోకొంత ఆదాయం పొందుతోంది. నిబంధనల ప్రకారం మత్స్యశాఖ ప్రతిఏటా సొసైటీలు ద్వారా సమకూరిన ఆదాయంలో పదిశాతం నీటి వినియోగ సొసైటీల ఖాతాల్లో నిధులు జమ చేయాలి. మరో పదిశాతం నిధులను గ్రామపంచాయతీలకు అందజేయాలి. కానీ ప్రస్తుతం నీటి వినియోగ సంఘాలు లేకపోవడంతో మత్స్యశాఖ ఆ నిధులను తన వద్దే ఉంచుకుంటోంది. ఇంతేకాకుండా చిన్నపాటి చెరువులకు వేలంపాట ద్వారా గ్రామపంచాయతీలు ఆదాయం పొందుతున్నాయి. ఈ రెండు శాఖలకు మంజూరయ్యే నిధులపై ప్రభుత్వం పర్యవేక్షణ లేకపోవడంతో నిధులు దుబారా అవుతున్నాయి.

**చేతులెత్తేసిన ఎన్ఆర్ఈజీఎస్..**

వాస్తవంగా పంటకాల్వలను ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో భాగంగా బాగు చేసుకోవాలని ప్రభుత్వం గతంలో సూచించింది. కానీ కాల్వల్లో జంగిల్ కటింగ్, పూడిక తొలగించడం వంటి పనులతో కూలీ గిట్టుబాటు కావడం లేదనే సాకుతో ఉపాధి కూలీలు ఆయా పనులంటేనే ససేమిరా అంటున్నారు. దీంతో ఎన్ఆర్ఈజీఎస్ అధికారులు సైతం పంటకాల్వల జోలికి వెళ్లకుండా వార్షిక ప్రణాళిక రూపొందించి తమ విధులను మమ అనిపించుకుంటున్నారు.

**పంటకాల్వలు అధ్వానం**



గతంలో మిషన్ కాకతీయ పనులు జరిగిన సమయంలో చెరువు నుంచి కొద్దిదూరం పంటకాల్వలను అధికారులు బాగుచేయించారు. అదే సమయంలో రైతులందరం కలిసి మరికొంత బాగు చేసుకున్నాం. కానీ ఆ తరువాత నిర్వహణ లేక కాల్వలన్నీ అధ్వానంగా మారాయి.

– వాంకుడోత్ శ్రీను, రైతు, పోచారం తండా

**కాల్వలు ఉంటేనే పంటలు పండేది**



గత వానాకాలంలో పంటకాలవ్వలకు చాలాచోట్ల గండ్లు పడ్డాయి. కాల్వల రూపమే మారిపోయింది. ప్రస్తుతం చెరువుల ద్వారా మత్స్యశాఖకు ఆదాయం సమకూరుతోంది. ఈ నిధుల నుంచి కొంత కాల్వల నిర్వహణకు ఖర్చు చేయాలి. ప్రభుత్వం కూడా ప్రత్యేక గ్రాంట్లను మంజూరు చేయాలి.

– ధనియాకుల బాబు, రైతు, చల్లసముద్రం

## జాతీయస్థాయి క్రీడల్లో రాణించాలి



సర్టిఫికెట్ అందజేస్తున్న కాపు సీతాలక్ష్మి

**కొత్తగూడెంటౌన్:** చదువుతో పాటు జాతీయస్థాయి క్రీడల్లో రాణించాలని కొత్తగూడెం మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి అన్నారు. రుద్రంపూర్ పరిధిలోని త్రీఇంక్‌లైన్ తెలంగాణ క్రీడా మైదానంలో జిల్లా స్పోర్ట్స్ అథారిటీస్ ఆధ్వర్యంలో జరుగుతున్న వేసవి శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి హాజరయ్యారు. శిక్షణ పొందిన క్రీడాకారులకు సర్టిఫికెట్లు అందజేశారు. మాట్లాడుతూ.. ఇలాంటి శిక్షణ తరగతులను క్రీడాకారులు సద్వినియోగం చేసుకుని జాతీయస్థాయిలో జిల్లాకు పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు కాశీహుస్సేన్, కోచ్ పి.నిహారిక, త్రీఇంక్‌లైన్ సర్పంచ్ అంగోతి మోతీ, ఎంపీటీసీ బోడ శారద, జిల్లా రెజ్లింగ్ అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ కాపు కృష్ణ, ఉపాధ్యక్షుడు ఆదినారాయణ, జిల్లా తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఇ.మొగిలి, కృష్ణారావు పాల్గొన్నారు.

## బీజేపీని గద్దె దింపి దేశాన్ని కాపాడుకుందాం..



మాట్లాడుతున్న విశ్వనాథం

**పాల్వంచరూరల్:** కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం విమర్శించారు. చంద్రాలగూడెం, మామిడిగూడెం, రేగులగూడెం, లక్ష్మీదేవిపల్లి, ఉల్వనూరు, సత్యనారాయణపురం, సారెకల్లు, కారెగట్టు, ప్రభాత్‌నగర్ గ్రామాల్లో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ ప్రజల కోసం కాకుండా కార్పొరేట్ల కోసం పనిచేస్తున్నారని బీజేపీని గద్దె దింపి దేశాన్ని కాపాడుకోవాలన్నారు. జిల్లాలో 2.99 లక్షల ఎకరాలకు పోడు పట్టాలు ఇస్తామని ప్రకటించిన కేసీఆర్ సర్వేలతోనే కాలయాపన చేస్తున్నారని, అవుట్ సోర్సింగ్ కార్మికులు, ఉద్యోగుల క్రమబద్ధీకరణ, జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. ఈనెల 11వ తేదీన కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో జరగనున్న ప్రజాగర్జన బహిరంగ సభకు ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో మండల కార్యదర్శి వీసం శెట్టి పూర్ణచందర్‌రావు, వేములపల్లి శ్రీను, ఎండీ పాషా, రాందాస్, సమ్మయ్య, నారాయణ, సారయ్య, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## హోంగార్డులకు న్యాయం జరిగేదెప్పుడు?



మాట్లాడుతున్న కామేష్

**కొత్తగూడెంఅర్బన్:** తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్ష నెరవేరిందనే ఆనందాన్ని ఆ తొమ్మిదేళ్లలో ఒక్కసారి కూడా సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు చూపించలేకపోయిందని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ ఆరోపించారు. పోలీసు సురక్ష దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం బీఎస్పీ కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి కేసీఆర్ హోంగార్డులను రెగ్యులర్ చేస్తానని హామీ ఇచ్చారని, అది ఎందుకు నెరవేర్చలేకపోయారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. హోంగార్డులకు ఉద్యోగ భద్రత, ఆరోగ్య బీమా లాంటి సౌకర్యాలు కల్పించి కడుపులో పెట్టుకుని చూసుకుంటామని కేసీఆర్ మాయమాటలు చెప్పి మోసం చేశారని ఆరోపించారు. విధి నిర్వహణలో హోంగార్డ్ ఒకవేళ మరణిస్తే కారుణ్య నియామకాలలో వారి కుటుంబ సభ్యులకు ఎందుకు ప్రాధాన్యం ఇవ్వడం లేదని ప్రశ్నించారు. 2012వ సంవత్సరం ఎస్ఐ బ్యాచ్‌కు చెందిన వారికి ఎందుకు ప్రమోషన్లు ఇవ్వడం లేదో ముఖ్యమంత్రి కేసీఆర్ సమాధానం చెప్పాలన్నారు. రాష్ట్రంలో పోలీసులకు ఇంక్రిమెంట్లు, ప్రమోషన్లు, డీఏలు సకాలంలో ఇవ్వకపోవడానికి గల కారణాలు చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పోలీసు ఉద్యోగులకు ప్రతినెల 1వ తేదీన జీతాలు ఇచ్చుకోలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉందని ఆరోపించారు. కార్యక్రమంలో గంధం మల్లికార్జున్‌రావు, జిల్లా కార్యదర్శి చెనిగారపు నిరంజన్‌కుమార్, అల్లకొండ శరత్, సందేల సందీప్, తాటిపాముల హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**పేదల భూములకు పట్టాలివ్వండి**

**పాల్వంచ:** పట్టణంలోని సర్వే నంబర్ 727లో పేదల ఆధీనంలో ఉన్న భూములకు ప్రభుత్వం వెంటనే పట్టాలు ఇవ్వాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం రేవంత్‌నగర్‌ను సందర్శించారు. మాట్లాడుతూ.. ఇల్లు లేని నిరుపేదలకు ప్రభుత్వం సర్వే నిర్వహించి బీపీఎల్ కింద యాజమాన్య హక్కులు కల్పించి, పేదల జీవితాల్లో వెలుగులు నింపాలన్నారు. పేదలకు తాము అండగా ఉంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కోళ్లపూడి ప్రవీణ్‌కుమార్, వానపాకుల రాంబాబు, అరిగే గోపీకృష్ణ, అజ్మీరా లక్ష్మణ్, బోడ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సమస్యలకు శాశ్వత పరిష్కారం



మాట్లాడుతున్న పొట్ల నాగేశ్వరరావు

**పాల్వంచరూరల్:** బస్వతారాకకాలనీ పంచాయతీలోని వీరునాయక్‌తండాలో ఆదివారం మాజీ ఎమ్మెల్సీ టీపీసీసీ ఉపాధ్యక్షుడు పొట్ల నాగేశ్వరరావు స్థానిక నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్యలను తక్షణం పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ జేబీ శౌరి, మోతుకూరి ధర్మారావు, వెల్లంకి వెంకటేశ్వరరావు, రావూరి నాగేశ్వరరావు, గడ్డం రాజశేఖర్, ఎంపీటీసీ కసనబోయిన భద్రం పాల్గొన్నారు.

**రైల్వే ప్రమాద బాధితులను ఆదుకోవాలి**

**కొత్తగూడెంరూరల్:** ఒడిశా జరిగిన రైలు ప్రమాదం ఘటనకు నైతిక బాధ్యతగా ప్రధాని మోదీ రాజీనామా చేయాలని టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొట్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. కొత్తగూడెంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ఒడిశా రైలు ప్రమాదంలో 280 మందికి పైగా మృతి చెందగా, 900 మందికి పైగా గాయపడినట్లు చెప్పారు. జేబీ శౌరి, మోతుకూరి ధర్మారావు, ఎల్లంకి వెంకటేశ్వరరావు, కసనబోయిన భద్రమ్మ, గడ్డం రాజశేఖర్, మహ్మద్ గౌస్, అల్లాడి నర్సింహరావు పాల్గొన్నారు.

**టేకులపల్లి:** దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు దాటిందని, దేశ చరిత్రలో ఒడిశాలో జరిగిన రైలు ప్రమాదం లాంటి ఘటన ఇంతకు ముందెన్నడూ జరగలేదని కాంగ్రెస్ పార్టీ జిల్లా నేత లక్కినేని సురేందర్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఘోరమైన ఈ రైలు ప్రమాదానికి నైతిక బాధ్యత వహిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ, రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ ప్రమాదంలో మరణించిన వారికి, క్షతగాత్రులకు ఏం చేస్తారో స్పష్టంగా చెప్పకుండా సంఘటనా స్థలానికి వెళ్లి ఫొటోలకు ఫోజులిస్తున్నారే తప్ప బాధితులకు న్యాయం జరగడం లేదని ఆరోపించారు. 300 మంది రైల్వే ప్రయాణికుల మృతికి బీజేపీ ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని తెలిపారు.


## మెరిట్ విద్యార్థులకు సన్మానం



మహేష్‌ను సన్మానిస్తున్న నాయకులు

**జూలూరుపాడు:** ప్రభుత్వ పాఠశాల, కళాశాలలో పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ఆదివారం జూలూరుపాడు మండల విశ్వబ్రాహ్మణ సంఘం సన్మానించింది. పాపకొల్లు హైస్కూల్ చెందిన సున్నం మహేష్ పదో తరగతిలో 9 జీపీఏ సాధించాడు. అశ్వారావుపేట గురుకుల కళాశాలలో చదివిన జూలూరుపాడుకు చెందిన రేవతి ఇంటర్‌లో 952 మార్కులు, కొత్తగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదుకున్న కాకర్లకు చెందిన గున్నంశెట్టి కార్తీక్ 954 మార్కులు సాధించారు. వారిని శాలువాతో సన్మానించి ఒక్కొక్కరికి రూ.2,500 ప్రోత్సాహక బహుమతి అందజేశారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు తిప్పర్తి శివ, పూసాల శ్రీనివాసాచారి, సున్నం కృష్ణమాచారి, సున్నం ప్రసాద్, వీరభద్రాచారి, సున్నం పిచ్చాచారి, యలబాక వెంకటేశ్వర్లు, ముత్తా చారి, శ్రీను, శంకరాచారి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## టీవీపీఎస్ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ



కొవ్వొత్తులతో శ్రద్ధాంజలి ఘటిస్తున్న దృశ్యం

**కొత్తగూడెంఅర్బన్:** ఒడిశా రాష్ట్రంలోని భువనేశ్వర్ రైల్వే స్టేషన్ సమీపంలో శుక్రవారం మూడు రైలు ఢీకొన్న దుర్ఘటన పట్ల కొత్తగూడెంలోని తెలంగాణ విభిన్న ప్రతిభావంతుల సంఘం (టీవీపీఎస్) వ్యవస్థాపకుడు సతీష్ గుండపునేని దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మరణించిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని ఆదివారం ముర్రేడు వాగు బ్రిడ్జి నుంచి బస్టాండ్ సెంటర్‌లోని అమరవీరుల స్తూపం వద్ద కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. మాట్లాడుతూ.. ఒకేసారి మూడు రైళ్లు ప్రమాదానికి గురికావడం, సుమారు 300 మంది మరణించడం, 1000 మంది గాయాల పాలవడం రైల్వే చరిత్రలో మూడో అతిపెద్ద ప్రమాదంగా నమోదు కావడం బాధాకరమన్నారు. మరణించిన వారి కుటుంబాలకు రైల్వే శాఖ రూ.20 లక్షల నష్టపరిహారం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా రైల్వే శాఖ మరిన్ని కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో షేక్ దస్తగిరి, దివ్యాంగ ఉద్యోగ సంఘాల అధ్యక్షుడు మాలోత్ జగ్గు దాస్, సంఘ ప్రధాన కార్యదర్శి మేడి ప్రవీణ్, కళా బాబురెడ్డి, నాగేశ్వరరావు, సాయిబాబా, గట్ల రమేష్, శైలజ, సున్నం కరుణాకర్, చాంద్ పాషా, రహీముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

### విద్యుత్ విజయోత్సవానికి తరలిరండి

**టేకులపల్లి:** తెలంగాణ రాష్ట్రం అవతరించి తొమ్మిదేళ్లు పూర్తై 10వ వసంతంలోకి అడుగిడుతున్న సందర్భంగా నిర్వహిస్తున్న దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం విద్యుత్ సంస్థల ఆధ్వర్యంలో బొజ్జాయిగూడెంలోని ఎస్ఎస్ గార్డెన్స్‌లో ఉదయం 10 గంటలకు జరగనున్న ఇల్లెందు నియోజకవర్గ స్థాయి విద్యుత్ విజయోత్సవ సభకు తరలిరావాలని టేకులపల్లి, బొమ్మనపల్లి విద్యుత్ ఏఈలు హెచ్.దేవా, పీజీ కన్నయ్య ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. టేకులపల్లి మండల రైతులు, విద్యుత్ వినియోగదారులు, పాత్రికేయులు, ప్రముఖులు సకాలంలో హాజరై విద్యుత్ విజయోత్సవ సభను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

### జామా మజీద్ కమిటీ ఎన్నిక



సయ్యద్ యాసీన్



ఎస్కే బాబాజీ

**జూలూరుపాడు:** జూలూరుపాడు జామా మజీద్ నూతన కమిటీ ఎన్నిక ఆదివారం జరిగింది. ముస్లిం పెద్దల సమక్షంలో కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. అధ్యక్షుడిగా సయ్యద్ యాసీన్, ఉపాధ్యక్షుడిగా ఎస్కే జానీమియా, ప్రధాన కార్యదర్శిగా ఎస్కే బాబాజీ, సహాయ కార్యదర్శిగా ఎస్కే జాన్ బాబు, కోశాధికారిగా ఎస్కే మహబూబ్ పాషా మరో ఐదుగురిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎస్కే లతీఫ్, ఎస్కే కరీముల్లా, ఎస్కే జానీ, ఎస్కే నాగుల్‌మీరా, జానీమియా, ఎస్కే మైబూ, సయ్యద్ పెద్ద నాగుల్‌మీరా, ఎస్కే చాంద్‌పాషా, ఎస్కే సోందూ, ఎస్కే మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

### వంటగ్యాస్ వినియోగంపై అవగాహన

**పాల్వంచరూరల్:** వంట గ్యాస్ వినియోగంలో ప్రమాదాలు జరగకుండా వినియోగదారులకు అవగాహన కల్పించారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండల పరిధి కిన్నెరసాని గ్రామంలో ఆదివారం వంట గ్యాస్ వినియోగంపై స్థానికులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్యాస్ వాడకంలో ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అనుకోకుండా ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎస్.త్రినాథ్‌బాబు, హెచ్‌పీ గ్యాస్ మేనేజర్ ఎ.లక్ష్మీనారాయణ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సోయం కృష్ణ, హెచ్‌పీ గ్యాస్ సిబ్బంది పాల్గొన్నారు.

## బోనాల వేడుకలో ఎమ్మెల్యే



ఇల్లెందురూరల్: బోనాలతో తరలివస్తున్న మహిళలు



టేకులపల్లి: దాసుతండాలో బోనంతో వెళ్తున్న ఎమ్మెల్యే బానోతు హరిప్రియ

**టేకులపల్లి:** దాసుతండా పంచాయతీలో మూడు రోజులుగా బొడ్రాయి, ముత్యాలమ్మ, పోతురాజు విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవ వేడుకలు జరుగుతున్నాయి. ఈ మేరకు ప్రతిష్ఠాచార్యులు శ్రీరంగం అజయ్ సాయి చక్రి చేత ప్రత్యేక పూజా కార్యక్రమాలు, బోనాల వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే బానోతు హరిప్రియ, గ్రామంలోని మహిళలు, యువతులు బోనాలతో ఊరేగింపుగా బొడ్రాయి, ముత్యాలమ్మ, పోతురాజు, గ్రామ దేవతల విగ్రహాల వద్ద ప్రదక్షిణలు చేసి జలాభిషేకం చేశారు.

**ఇల్లెందురూరల్:** మండలంలోని బోయితండా గ్రామపంచాయతీ తుంటుబాలు తండా గ్రామంలో ఆదివారం నాభిశిలకు గ్రామస్తులు పూజలు చేశారు. గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠించి మూడేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పూజలు చేశారు. ప్రతి కుటుంబం నుంచి బోనాలతో తరలివచ్చి నాభిశిలకు నైవేద్యం సమర్పించారు. గ్రామం చల్లగా ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని గ్రామ దేవతను వేడుకున్నారు.

**అటెన్షన్ ప్లీజ్**

### నిరుపయోగంగా ఏఎన్ఎం క్వార్టర్



జూలూరుపాడు మండలం కొమ్ముగూడెం పల్లె దవాఖానా ప్రాంగణంలోని ఏఎన్ఎం క్వార్టర్ భవనం నిరుపయోగంగా ఉంది. ప్రస్తుతం పల్లె దవాఖానగా కొనసాగుతున్న హెల్త్ సబ్ సెంటర్ భవనం పక్కన ఏఎన్ఎం నివాసం కోసం భవనం నిర్మించారు. నిర్మించిన నాటి నుంచి విద్యుత్, తాగునీటి సౌకర్యం లేకపోవడంతో ఏఎన్ఎంలు అందులో నివాసం ఉండేందుకు విముఖత వ్యక్తం చేశారు. అప్పటి నుంచి ఆ భవనం ఖాళీగానే ఉంది. దీంతో తలుపులు, కిటికీలు శిథిలమై విషసర్పాలకు నిలయంగా మారింది. సంబంధిత అధికారులు స్పందించి భవనాన్ని వినియోగంలోకి తీసుక రావాలని స్థానికులు కోరుతున్నారు. – జూలూరుపాడు

ప్రశ్నించాల్సిన అధికారి : డాక్టర్ రాకేష్ కుమార్, మెడికల్ ఆఫీసర్, పీహెచ్‌సీ జూలూరుపాడు
సెల్ నంబర్: 9985998656